పేదలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బాచుపల్లి గ్రామ బాధితులతో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, నవంబర్ 23 : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బాచుపల్లి గ్రామానికి చెందిన పగడాల రాఘవేందర్, అబ్బుల్లాపూర్ మెట్టు వద్ద వరద తాకిడికి వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. దీంతో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం సబితా ఇంద్రారెడ్డి కృషి వల్ల నష్ట పరిహారం కింద రూ. 4లక్షలు మంజూరు చేసింది. డబ్బులను నేటికి విడుదల చేయకపోవడంతో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. కుటుంబ పెద్ద లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మృతుడి భార్య చెప్పడంతో వెంటనే సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయ డీఆర్‌ఓకు ఫోన్ చేసి మంజూరైన డబ్బులు ఎందుకు ఇవ్వడంలో ఆలస్యం జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. సబితా ఇంద్రారెడ్డి చొరవతో రెండు రోజుల్లో బాధితులకు డబ్బులు అందజేస్తామని తెలిపారు. తామస్‌రెడ్డి,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ట్రై సైకిల్ అందజేత..

దన్నారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొంగర సత్తయ్య తనకు నడవడానికి ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేను ఆశ్రయించడంతో శనివారం దివ్యాంగుడిని క్యాంపు కార్యాలయానికి పిలిచి మానవతా ధృక్పదంతో ట్రై సైకిల్‌ను అందజేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. దివ్యాంగులు అధైర్యపడ వద్దని తెలిపారు. మాజీ డైరెక్టర్ పిట్టల పాండు ముదిరాజ్, మీర్‌పేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, బ్రహ్మణపల్లి చంద్రశేఖర్ గుప్తా, ప్రభాకర్ పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

మన్సూరాబాద్, నవంబర్ 23: చదువులతో పాటు సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జైపురికాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి జైపురికాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం శ్రీనిధి ఇంజినీరింగ్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ఆరోగ్యాల పరిశుభ్రత, వ్యక్తిగత అలవాట్లు, రోడ్లు భద్రత, ట్రాఫిక్ అంశాలు, పర్యావరణ అంశాలపై శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఉర్వి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీ బ్యూల, రమాదేవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వనభోజనాలు

వనస్థలిపురం, నవంబర్ 23 : కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 37వ కార్తీక వనభోజనాలను జయప్రదం చేయాలని కాపు యువత జిల్లా నాయకుడు జమదగ్ని, కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడు అదృశ్యం

అరుణ్‌కుమార్

హయత్‌నగర్, నవంబర్ 23 : ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్, రాంనగర్‌కు చెందిన ఏదుల అరుణ్‌కుమార్ వృత్తిరీత్యా డ్రైవర్. నాలుగు నెలల క్రితం అబ్దుల్లాపూర్ మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట లోని ఎస్‌బీఐ బ్యాంకులో సాలరీ తెచ్చుకుంటానని చెప్పి రాంనగర్ నుంచి పెద్దఅంబర్‌పేటకు వచ్చాడు. అప్పటి నుంచి అక్కడే ఉంటూ డ్రైవింగ్ చేస్తున్నాడు. కొద్దిరోజుల అనంతరం కుటుంబ సభ్యులు అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేయగా స్పందించడం లేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పెద్దఅంబర్‌పేట చుట్టూపక్కల, బంధువుల వద్ద వెతికినా అతడి ఆచూకీ దొరకలేదు. తల్లి ఏదుల లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశాన వాటిక పనులు ప్రారంభించాలి

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్కేపురం, నవంబర్ 23 : సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కుతుబ్ షాహీ మసీద్ గ్రేవ్ యార్డ్ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం సరూర్‌నగర్ డివిజన్ వార్డు మెంబర్ మహ్మద్ జహీర్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి నేతృత్వంలో రూ. కోటి 80 లక్షలతో శ్మశాన వాటిక పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేశారని తెలిపారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభించలేదన్నారు. పనులు వెంటనే ప్రారంభించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కలిసి కోరామన్నారు. సంబంధింత అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు చెప్పారు. ఇస్మాయిల్, రజాక్, జహంగీర్ తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

బడంగ్‌పేట, నవంబర్23: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ అబ్జల్, బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను పరిష్కరించాలన్నారు. కొన్ని పనులు శంకుస్థాపనలు చేసిన తర్వాత కూడా పనులు చేయడం లేదని తెలిపారు. అందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎందుకు పనులు చేయడం లేదని అడిగారు. జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌కు ఫోన్ చేసి పనులు త్వరగా పూర్తి చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్లకు ప్రత్యేక నిధులు కేటాయించామని తెలిపారు. సగం పనులు పూర్తి చేసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నిధులను రద్దు చేశారన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీకి మంజూరైన రూ. 25కోట్లు రద్దు చేయడం వలన పనులు ఆగిపోవడం జరిగిందన్నారు. రద్దు చేసిన నిధులను ప్రభుత్వం తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మహాధర్నా విజయవంతం చేయాలి

పోస్టర్ కరపత్రాలను ఆటోనగర్‌లో ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మన్సూరాబాద్, నవంబర్ 23: బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిలుపుదల చేసి సింగరేణికి నేరుగా గనులను కేటాయించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న ధర్నా కరపత్రాలను శనివారం ఎల్బీనగర్, ఆటోనగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు దేశవ్యాప్తంగా కనీస వేతనాన్ని రూ. 26 వేలకు పెంచాలని, పెన్షన్ రూ. 10 వేలు అందించాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక వర్గాలతో పాటు ప్రజానీకం పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు కృష్ణయ్య, భాస్కర్, మెట్టు లింగం, లింగస్వామి, సుధీర్, మెట్టు నర్సింహ, మధు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించిన కమిషనర్

బడంగ్‌పేట, నవంబర్ 23: రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ సరస్వతి నాదర్‌గుల్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను, గుర్రంగూడలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి కమిషనర్ అవాక్కయారు. అధ్వానంగా ఉన్న మరుగు దొడ్లు, టాయిలెట్స్‌ను చూసి ఎందుకు ఇలా ఉన్నాయని అన్నారు. దగ్గరుండి క్లీన్ చేయించారు. అపరిశుభ్రంగా ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. పరిశుభ్రత పై విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, స్థానిక కార్పొరేటర్‌తో కలిసి బడంగ్‌పేటలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కమిషనర్ సరస్వతి

పాఠశాలను నిర్మించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు

మన్సూరాబాద్, నవంబర్ 23: నాగోల్ డివిజన్ పరిధి బండ్లగూడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన స్థలంలో.. పాఠశాలను నిర్మించాలని కోరుతూ శనివారం ఉప్పల తహసీల్దార్‌కు బండ్లగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ బండ్లగూడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణం కోసం గతంలో ఒక ఎకరం స్థలం కేటాయించారన్నారు. ఈ స్థలంలో 278 గజాల స్థలం విషయంలో కోర్టులో వివాదం కొనసాగుతుందన్నారు. వివాదంలో లేని స్థలంలో పాఠశాలను నిర్మించి విద్యార్థులకు ఆట స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సహదేవ్‌గౌడ్, రాందదాస్, శ్రీనివాసచారి, గణేశ్ పాల్గొన్నారు.

మాస్టర్ చెఫ్ మామ్ పోటీలు

సైదాబాద్, నబంబర్ 23 : చిన్నారులకు నాణ్యమైన విద్యతోపాటు, పోషక విలువలు కూడిన ఆహారం ఎంతో అవసరమని, అదే వారికందించే భవిష్యత్ నిధి అని శ్రీత్రివేణి పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. చంపాపేటలోని శ్రీత్రివేణి పాఠశాలలో శనివారం ప్రీ ఫైమరీ కరిక్యులమ్‌లో భాగంగా విద్యార్థుల తల్లులకు నిర్వహించిన మాస్టర్ చెఫ్ మామ్-2024 పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొన్న చిన్నారుల తల్లులు తమ పిల్లలకు ఏ విధమైన ఆహారం అందజేస్తున్నారో తెలిపే వంటకాలను తయారీ చేసి ప్రదర్శించారు. చిన్నారుల కోసం తయారు చేసిన ఆహార పదర్థాలతో తమ చక్కటి ప్రదర్శనతో అలరించారు. చిన్నారులు తమ నృత్యాల ద్వారా ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల విశిష్టతను వివరించే విధంగా చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలుగా నిలిచిన తల్లులకు మాస్టర్ చెఫ్ మామ్-2024 టైటిల్, ట్రోఫీ బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'

మన్సూరాబాద్, నవంబర్ 23: తెలంగాణ వ్యాప్తంగా రాబోయే వారం రోజుల పాటు చలిగాలులు తీవ్రంగా పెరిగే అవకాశం ఉన్నందున మూడేళ్ల లోపు పిల్లలు, వృద్ధులు, గర్భిణీ ల ఆరోగ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్బీనగర్ కామినేని దవాఖాన సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్ రవీందర్‌రెడ్డి సూచించారు. శీతాకాలంలో చలిగాలులు తీవ్రంగా ఉన్న సమయంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, తీసుకోవల్సిన జాగ్రత్తలు, చికిత్స పద్ధతులపై శనివారం ఎల్బీనగర్ కామినేని దవాఖానలోని ఇందిరా ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. చలిగాలుల వలన శ్వాస కోశ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువవుతాయన్నారు. శ్వాస కోశ ఇన్‌ఫెక్షన్లు వచ్చినప్పుడు దగ్గు, జలుబు, శ్వాసలో ఇబ్బంది, పిల్లికూతలు, జ్వరం, తల తిరగడం, గుండెదడ లాంటి లక్షణాలు కనపడతాయన్నారు. ఉష్ణోగ్రతలు తగ్గుతున్నప్పుడు వచ్చే ఇలాంటి వ్యాధులపై అశ్రద్ధ వహించకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు.

సింహగర్జన సభను విజయవంతం చేయాలి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న బేర బాలకిషన్ తదితరులు

ఆర్కేపురం, నవంబర్ 23 : డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహ గర్జన సభకు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున మాలలు హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ మండల కార్యాలయం వద్ద మాలల సింహ గర్జన పోస్టర్‌ను గ్రేటర్ హైదరాబాద్,రంగారెడ్డి జిల్లా బ్యాగరి కాటి కాపరుల సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా బేర బాలకిషన్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి తెలంగాణలో ఉన్న 50లక్షల మంది మాలలు అహోరాత్రులు కష్టపడ్డ విషయాన్ని రేవంత్‌రెడ్డి మర్చిపోకూడదని అన్నారు. గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో మనువాద భారతీయ జనతా పార్టీకి మాదిగలందరూ ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని ఓడించాలన్న మందకృష్ణ మాదిగ మాటలు నమ్మి మాలలకు మోసం చేస్తే తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు పూర్తిగా మారిపోతాయని, తెలంగాణలో ఉన్న తొమ్మిది మంది మాలల శాసన సభ్యులు వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏమాత్రం దళితుల మీద ప్రేమ ఉంటే ఇప్పుడున్న ఎస్సీ రిజర్వేషన్లను 15శాతం నుంచి 25 శాతంకు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మాలలకు ప్రత్యేకంగా మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు నిధులను బడ్జెట్లో పొందుపరచాలని కోరారు. ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణ చేపడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మహేశ్వరం నుంచి వేలాది మంది మాలలు సింహ గర్జన సభకు తరలిరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తునికి పద్మాకర్, మాల బ్యాగరి కాటికాపరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువలో డ్రైనేజీని కలుపొద్దు

ఆందోళన చేస్తున్న సెంట్రల్‌బ్యాంకు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మన్సూరాబాద్, నవంబర్ 23: వరదనీటి కోసం ఏర్పాటు చేసిన ట్రంక్‌లైన్‌లో డ్రైనేజీ మురుగునీటిని కలపాలని చూస్తే సహించేది లేదని సెంట్రల్‌బ్యాంకు కాలనీవాసులు హెచ్చరించారు. వరదనీటి ట్రంక్‌లైన్‌కు సీవరేజీ వాటర్‌ను అనుసంధానం చేసేందుకు జలమండలి అధికారులు తవ్విన గుంత వద్ద శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి సెంట్రల్‌బ్యాంకు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎల్‌పీటీ మార్కెట్ వెనుక భాగంలో నూతనంగా నిర్మించిన కొన్ని బహుళ అంతస్తుల డ్రైనేజీని అక్రమ మార్గంలో సెంట్రల్ బ్యాంకు కాలనీలోని వరదనీటి కాలువలోకి మళ్లించాలని అధికారులు ప్రయత్నించడం వెనుక మర్మమేమిటో ప్రజలకు వివరించాలన్నారు. వరదనీటి కాలువలోకి డ్రైనేజీని మళ్లించడాన్ని తాము వ్యతిరేకిస్తుండటంతో కొత్తగా చంద్రపురికాలనీ వద్ద ఉన్న వరదనీటి ట్రంక్‌లైన్‌లోకి వరదనీటిని మళ్లించడానికి జలమండలి అధికారుల ప్రయత్నిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. సెంట్రల్ బ్యాంకు కాలనీలోని శ్రీ ఉమానాగలింగేశ్వర స్వామి దేవాలయం నుంచి చంద్రపురికాలనీ వరకు ఏర్పాటు చేసిన వరదనీటి ట్రంకులైన్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోను డ్రైనేజీని కలువనివ్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జక్కిడి తిరుమల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఠాగూర్ రాకేశ్‌సింగ్, కాలనీవాసులు విద్యాసాగర్, బైరవరెడ్డి, కృష్ణప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, సురేశ్‌కుమార్‌గౌడ్, సుబ్రహ్మణ్యం, గోపాల కృష్ణమూర్తి, కోటిరెడ్డి, వినోద్‌ప్రసాద్, మధూసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సంస్కరణలు, వ్యూహాలపై సెమినార్

బడంగ్‌పేట, నవంబర్23: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ఎంఈసీ సంయుక్తంగా 'ఉన్నత విద్యా సంస్థల పరీక్ష సంస్కరణలు, వ్యూహాలు' అనే అంశం పై శనివారం సెమినార్ నిర్వహించారు. విద్యా విధానంలో ఎదురవుతున్న సవాళ్లు,వాటి పరిష్కారాల పై సెమినార్ గురించి ఎంవీఎస్ డీన్ డాక్టర్ సీపీ వర్ధిని అధ్యక్షత వహించి సెమినార్ లక్ష్యాల గురించి వివరించారు. ముఖ్య వక్తలు ఎంవీఎస్ ఆర్ కళాశాల చైర్మన్ పీవీ ఆర్ కశ్యప్, తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి, ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, తెలంగాణ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, ఉస్మానియ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్, ప్రొఫెసర్ సుబ్రమణ్యం, రామ చంద్రరావు, ప్రొఫెసర్ అప్పారావు, ప్రొఫెసర్ సాయి కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ , డాక్టర్ శశికాంత్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్, కళాశాల కోశాధికారి జూపూడి సుధాకర్, మాతృ శ్రీ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ , హిరణ్మయి, గుంటూరు ఎంవీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో అదుపులోకి ఇద్దరు మైనర్లు

మన్సూరాబాద్, నవంబర్ 23: ద్విచక్ర వాహనాలను దొంగిలించిన కేసులో ఇద్దరు మైనర్లను నాగోల్ పోలీసులు అదుపులోకి తీసుకుని జువైనల్ హోంకు తరలించారు. సీఐ సూర్యానాయక్ కథనం ప్రకారం.. నాగోల్, సాయినగర్‌కాలనీకి చెందిన ఇద్దరు మైనర్లు (17)) జల్సాలకు అలవాటు పడ్డారు. తమ జల్సాలను తీర్చుకునేందుకు డబ్బులు లేకపోవడంతో ఇంటి ముందు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్ల ముందు పార్కింగ్ చేసిన బైకులను దొంగిలించాలని పథకం వేసుకున్నారు. దానిలో భాగంగా నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 4 బైకులు, చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 బైకులు అపహరించారు. నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన బైకు దొంగతనాల విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బైకు దొంగతనాలు జరిగిన ప్రదేశాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఇందులో ఒక మైనర్‌ను స్థానికుల సహకారంతో పోలీసులు గుర్తించారు. సాయినగర్ కాలనీలో ఉన్న ఇద్దరు మైనర్లను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా బైకు దొంగతనాల విషయం బయటపడింది. ఇద్దరు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. వారి వద్ద నుంచి 6 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు

బాలుర నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

స్పోర్ట్స్ లీగ్ ముగింపు వేడుకలు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్కేపురం, నవంబర్ 23 : ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ నారాయణ స్కూల్ దిల్‌సుఖ్‌నగర్ జోన్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన నారాయణ విద్యా సంస్థల 11 బ్రాంచ్‌లనందు నిర్వహించిన స్పోర్ట్స్ లీగ్ సందర్భంగా శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ స్కూల్స్ జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమంబర్, ఆర్ఐ రవి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని తెలిపారు. స్పోర్ట్స్ లీగ్‌లో కబడ్డీ, ఖో-ఖో, చెస్, క్యారమ్స్, రన్నింగ్ రేస్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఖో-ఖో లో బాలికల విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ఎల్బీనగర్ నారాయణ స్కూల్ విద్యార్థులను ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఏవో కరుణాకర్, పీఈటీ శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సత్యసాయి బాబా జయంతి



సత్యసాయి బాబా జయంతి వేడుకలను ఎన్‌జీవోస్ కాలనీ ఆర్ఎస్ఎస్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని మాట్లాడారు. సత్యసాయిబాబా తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎన్నో సేవలు చేశారన్నారు. ఆయన మరణించిన తర్వాత కూడా బాబా పేరుతో దేశ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బాబా బోధనలను అందరూ అర్థం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంపన వెంకటేశ్వరరావు, సోమయాజులు, బాబురావు, చంద్రయ్య, జైపాల్‌రెడ్డి, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. -వనస్థలిపురం, నవంబర్ 23

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 23: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాహెల్ ఫుడ్స్ ఫీడర్ పరిధిలో ఐజీహెచ్ఎస్ ఇండస్ట్రీయల్ ఏరియా, మధుబన్ వాటర్ ట్యాంక్, శివాజీనగర్ ఫీడర్ పరిధిలో జల్‌పల్లి ఇండస్ట్రియల్, శివానగర్ ఇండ